శ్రీమతి కోపూరి మాణిక్యమ్మ స్మారక కథలపోటీలో

ప్రథమ బహుమతి పొందిన కథ...

కథ

# అమ్మ పోయింతరువాత

శిరంసెట్టి కాంతారావు

చేతిలో ఉన్నా తినడానికి పనికిరాని చద్దన్నంలా

కంటికి ఎదురుగా ఉన్నా తాగడానికి పనికిరాని ఉప్పు నీటిలా

దట్టంగా అలుముకున్నా కురవని కారుమేఘంలా

నింగీ, నేలను కలుపుతున్న క్షితిజరేఖలా

అమ్మపోయిన తరువాత నలుగురు కొడుకులు, ఐదుగురు కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు అందరూ ఉండి ఎవ్వరూలేని ఒంటరిలా నాన్న పడ్డ ఇబ్బంది తనకే తప్ప ఆ దేవునికీ తెలియదు.

అమ్మ పోయినప్పుడు కర్మకాండలు అయిపోయిన మరునాడు మా బంధువులంతా ఇంటి ముందు వసారాలో సమావేశమై నాన్న విషయంలో ఏంచేయాలో చర్చించాలని తీర్మానించారు.

అప్పటి వరకు మా ఇండ్లల్లో ఎవరికి, ఏసమస్య వచ్చినా పరిష్కరించే నాన్న విషయమై బంధువులంతా అలా కూర్చోవడం అమ్మపోగానే నాన్నకు తగిలిన మొదటిదెబ్బ.

ఎంతో ఆరోగ్యంగా ఉండే అమ్మ హఠాత్తుగా పోవడం అందరికీ బాధాకరమే అయినా ఒక్కపూట కూడా ఎవ్వరితో చేయించుకోకుండా వెళ్ళిపోవడం ఆహ్వానించదగిందే. అయినా, అమ్మ లేని నాన్న ఎవరిదగ్గరుండాలన్న సమస్యముందుకొచ్చింది. ఆ సమస్య ఏంటో తేలిపోతే చుట్టాలంతా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతారు.

అయితే, పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలి?

అందుకే ఎవరికివాళ్ళు నిశ్శబ్దంగా ఇంకొకరి వైపు చూసుకోసాగారు. ఎంతసేపటికీ ఎవ్వరూ మాట్లాడక పోవడంతో "ఎవరు చూసుకునేదేంటి? ఇంటికి పెద్ద కొడుకును కాబట్టి నాన్న భాద్యత నేనే తీసుకుంటాను. మా ఇంటికి తీసుకుపోతాను, మాతోనే ఉంచుకుంటాము" అంటూ నా నిర్ణయాన్ని వెల్లడించాను.

"మీకూ ముగ్గురాడపిల్లలు వాళ్ళ చదువులు, పెండ్లిల్లు, వచ్చేవాళ్ళు, పొయ్యేవాళ్ళు ముందు, ముందు ఎన్ని ఖర్చులు. ఒక మనిషిని చూడ్డమంటే ఇవ్వాళ్ళ అందరి ముందూ గొప్పగా చెప్పి నంత సులభంగాదు. వెనకా, ముందూ ఆలోచించుకుని జాగ్రత్తగా మాటివ్వండి" నామాటలకు ప్రతి స్పందనగా మా ఆవిడతో కళ్ళతోనే సంప్రదించిన మా పెద్ద బావమరిది నలుగురి ముందూ మా ఆవిడ మనసులోని మాటలను లౌక్యంగా వెళ్ళడించాడు.

కాదుమరి, ముందు ముందు బోలెడన్ని ఖర్చులున్నవాడు. ఇవ్వాళ్ళ బాధ్యతంతా ఒక్కడే మెడకు పెట్టుకుంటే రేపేదన్నా ఇబ్బందొచ్చిందన్నా ఎవ్వరూ తొంగిచూడనుకూడా చూడరు." అంటూ తమ్ముడికి బాసటగా మాట్లాడింది మా పెద్ద వదిన కూడా.

"ఏమిటిరా! మరి నీ మాటేంటి?" అంటూ రెండో వాణ్ణి ప్రశ్నించాడు మా పెద్దబాబాయి.

వాడేదో నోరు తెరిచి మాట్లాడబోతున్నంతలోనే " చెప్పేదేముంది? కోదాడలో మా పుట్టింటి వాళ్ళిచ్చిన స్థలంలో ఇల్లు మొదలు పెడదామనుకుంటున్నాం. అది పూర్తయ్యేనరికి ఎంతలేదన్నా ఏడాదో, రెండేండ్లో పడుతుంది. అప్పటిదాకా మేమే ఆ పక్కనే ఉన్న చిన్న పెంకుటిల్లు అద్దెకు తీసుకుందామనుకుంటున్నాము. ఇప్పుడు మేము మామయ్యను తీసుకుపోయి ఆ ఇరుకు ఇంట్లో పెడితే ఆయనకూ ఇబ్బందే, మాకూ ఇబ్బందే. అదే ఇల్లు పూర్తయ్యాక చెప్పండి ఇక ఎప్పటికీ మా దగ్గరే ఉంచుకోమన్నా ఉంచుకుంటాం" పారుతున్న నీటికి కాలు అడ్డం పెట్టినట్టు మాట్లాడింది రెండో వాడి భార్య.

ఆమెకేం తెలుసు? తన భర్త మొదటి పెళ్ళిలో చిన్న విషయం దగ్గర మొదలైన వివాదం చిలికి, చిలికి గాలివానైనట్టు అటువాళ్ళకు,

ఇటువాళ్ళకు మాట పట్టింపులొచ్చి, పెళ్ళైన ఆరునెళ్ళకే విడాకులదాకా వెళ్ళిందని. ఆఁ విడాకులకోసం కట్నంగా తీసుకున్న డబ్బులకు రెట్టింపు డబ్బులు ఇవ్వాల్సిరావడంతో అప్పటిదాకా ఎన్ని ఇబ్బందులు పడ్డా సెంట్ భూమికూడా అమ్మని నాన్న భూమినంతా తెగనమ్మి వాళ్ళకు డబ్బులు కట్టాడని. ఆఁ దిగులు ఇన్నేండ్లయినా నాన్న మనసు మూలల్లో కుంపటిలా రగులుతూనే ఉందని. అలాంటి నాన్నను తమ దగ్గర ఉంచుకోవడం కుదరదని ఎంత తెలివిగా చెప్పింది!?

పోనీ గతం తెలియని ఆవిడ ఏదో మాట్లాడిందనుకున్నా అన్నీ తెలిసిన వాడన్నా భార్య అలా మాట్లాడుతుంటే ఖండించడేం? నిన్నటిదాకా కోట గోడలా అందరినీ కాపుగాచిన నాన్న, కవచం లాంటి అమ్మ పోగానే ఇవ్వాళ్ళ అదేఅందరికీ మోయలేని భారమవుతున్నాడా!?

"ఏమమ్మా! మరి మీ సంగతేమిటి? మామయ్యను మీరన్నా చూసుకుంటారా?" మూడో వాడి భార్యవంక చూస్తూ అడిగింది మా మేనత్త.

"ఏమో నాకేంతెల్సు. ఆయన్నే అడగండి" ముక్తసరిగా బదులిచ్చింది మూడోవాడి భార్య.

"ఈవిడెప్పుడూ ఇంతే దేనికైనా గుంభనంగా ఉంటుంది. ఎక్కడా ఎక్కువ, తక్కువ మాట్లాడదుగాని, రేపురాబోయే విషయాన్ని ఈ రోజే పసిగట్టి మగడికి పాఠాలు నేర్పుతుంది. అంతే, వాడుకూడా ఆమె నేర్పిన పాఠం నేర్చినట్టే అప్పజెప్పుతాడు తప్ప ఒక్కపొల్లుగూడా ఎక్కువ, తక్కువగా మాట్లాడడు. మామూడోవాడు. ఇప్పుడూ అంతే కళ్ళు, చెవులు అప్పగించి పెళ్ళాం చెప్పింది విని ఊరుకున్నాడు తప్ప 'ఇది ఈపి, ఇదిపేను' అని నోరువిప్పి మాట్లాడలేదు.

అయినా వాడి ఆత్మకు తెలుసు 'వద్దు, వద్దురా' అంటూ నాన్న వద్దంటున్నా వినకుండా రాజకీయ ఊబిలోకి దిగి పీకల్లోతు అప్పుల్లో కూరుకు పోతుంటే వాణ్ణి ఒడ్డున పడెయ్యడం కోసం నాన్న ఎన్ని ఇబ్బందులు పడ్డాడో, ఎంతడబ్బు ఖర్చు పెట్టాడో? ఇప్పుడవన్నీ మర్చిపోయిన వాళ్ళు ఇట్లా మాట్లాడుతున్నారు; ఈ మాత్రం దానికేనా జనాలు కొడుకులో, కొడుకులో అంటూ పలవరిస్తుంటారు.

"ఏమ్మా! నాలుగు చేతులూ ఒకటవుతున్న వాళ్లే అట్లా మాట్లాడు తున్నారు. మరి నీ మాటేంటి? అంటూ మా నాలుగో మరదలిని కదిపాడు మా మేనమామ.

"మీకు తెలియందేముంది పెదనాన్న! పుట్టెడుభారం నా నెత్తినవేసి, ఆయనతోవ ఆయన చూసుకున్నాడు. ఇద్దరం చిన్న పిల్లల్తో వదినలతో సూటిపోటి మాటలు భరిస్తూ ఏదో ప్రైవేటు స్కూల్లో పని చేసుకుంటూ రోజులు వెళ్ళమారుస్తున్నా. ఇప్పుడు మావయ్యను తీసుకుపోయి ఎక్కడ పెట్టుకోను? అంటూ శుద్ధ అమాయకురాలిలా మాట్లాడింది.

"ఒహ్హో మనుషుల్లో స్వార్థం అన్నది ఎంత బలంగా నాటుకు పోతుందో కదా! తను నాన్నకు చిన్నమామ మనుమరాలని, పెద్దగా ఆస్తి పాస్తులులేని వాళ్ళని, సానుభూతితో వాళ్ళను అర్థం చేసుకుని ఇంటికోడలిగా చేసుకున్నందుకు కనీస కృతజ్ఞత కూడా లేకుండా ఇట్లాగేనా మాట్లాడేది? ఆమె ఖర్మ బాగోలేక కట్టుకున్న వాడు కాలం తీరి అర్థంతరంగా వెళ్ళిపోతే ఆమెను, ఆమెపిల్లలను మాకు తెలియ కుండా నాన్న ఎన్ని రకాలుగా ఆదుకోలేదు. అవసరం తీరిన మనుషులు ఎలా మారిపోతారో ఇంతకన్నా చెప్పేదేముంది?

"అందరి వంతూ అయ్యింది, ఇక నీ సంగతి కూడా చెప్పరా!" అక్కడ చేరిన వాళ్ళంతా ఆఖరివాడిని అడిగారు.

"నేను నెలలో సగంరోజులు డ్యూటీ మీదనే తిరుగు తుంటాను. వచ్చిఉంటే ఎవరొద్దన్నారు?" మనసుతో కాకుండా కేవలం నోటితోనే మాట్లాడి నట్టు మాట్లాడాడు ఆఖరివాడు.

వీడికోసం నాన్న ఎంతచేశాడు? చెడు స్నేహాలు పట్టి, ఇల్లూ- వాకిలీ పట్టకుండా భార్యా పిల్లల్ని వదిలేసి తిరుగుతుంటే, ఆఁ స్నేహాలు, ఆ అలవాట్లు మాన్పించడానికి ఎన్ని అవస్థలు పడ్డాడు. అటువంటివాడు అమ్మను కోల్పోయి విషాదంలో మునిగిపోయిన నాన్నను ఎంత ఆప్యాయంగా చూసుకోవాలి. కర్ర విరక్కుండా, పాము చావకుండా ఎంత తెలివిగా మాట్లాడుతున్నాడు!

"వీళ్ళెవ్వరూ చూడనవసరంలేదు.నేనే తీసుకు పోయి చూసుకుంటాను. మీరెవ్వరూ ఎవ్వర్నీ అడగాల్సిన అవసరంలేదు" అప్పటిదాకా మౌనంగా కూర్చుని చూస్తున్న చెల్లి ఒక్కసారిగా నాన్నను పట్టు కుని 'భోరు' మంటూ ఏడుస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించింది.

ఒక్కసారిగా అక్కడ చేరిన అందరి ముఖా ల్లోనూ గాంభీర్యం చోటుచేసుకుంది. అసలే యాభై ఏండ్లు సుఖంలోనూ, కష్టంలోనూ, కలిసి నడిచిన అమ్మ పోయిన దిగులుతో, బతుకు దారిన ఒంటరి ప్రయాణీకుడిగా మిగిలిపోయిన నాన్నను ముందు పెట్టుకుని, ఆయనకు గుప్పెడు మెతుకులు, చిటికెడు ప్రేమా పంచాల్సిన తన రక్తమే బాధ్యతలనుండి తప్పించుకోజూడడం ఆయన గుండెల్లో ఎన్ని అగ్ని పర్వతాలను బద్దలు చేస్తుందో ? ఎంతలావాను విరజిమ్ముతుందో?

అందరిమాటలూ వినీ, వినీ ఇక వినలేని నాన్న గొంతు విప్పుతూ... "నన్ను చూసుకునే విష యంలో ఇంతరచ్చ జరగడం నాకిష్టం లేదు. అసలు నా విషయం మాట్లాడమని నేనెవ్వరికీ చెప్పలేదు. ఐనా, విషయం ఇంతదూరం వచ్చింది కాబట్టి నామాటగూడా అందరూ వినండి" "అసలు నేనెవ్వరి దగ్గరా ఉండదలచుకోలేదు. అమరావతిలో నా లాంటి వాళ్ళకోసం ఎవరోపుణ్యాత్ములు ఆశ్రమం నిర్వహిస్తున్నారట. ఉన్న ఆస్తిని అమ్మాయి నాతో కలిపి మొత్తం ఏడు వాటాలు చేస్తున్నాను. అందులో నావాటాను ఎవరికైనా అమ్మేసి ఆఁ డబ్బులను ఆశ్రమానికి ఇచ్చేసి పోయేదాకా అక్కడే ఉంటాను.ఈ ఏర్పాట్లన్నీ ఇంతకు ముందే చేసుకున్నాము. మా ఇద్దరిలో ఎవరు ముందు, ఎవరు వెనుక అయినా ఇలాగే చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. ఇంతకాలం ఇల్లు, పిల్లలు, సంసారం అంటూ గంజిలో ఈగల్లా బతికాము. ఇకనుండన్నా ఈ బాదర, బందీలు వదిలేసి ఓ మనిషిలా బతకాలను కుంటున్నా" అంటూ తన నిర్ణయమేదో తెలియజేశాడు.

ఆఁ నిర్ణయం వెనుక ఎన్ని నిద్రలేని రాత్రులున్నాయో? ఎంత మానసిక వేదన సుడిగుండాలై




కళామిత్ర ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 25-10-2009న ఒంగోలు కాపు కళ్యాణమండపంలో డా॥ నూనె అంకమ్మరావు విరచిత గ్రంథం "డా॥ మంతెన రచనలు - సమగ్ర పరిశీలన" గ్రంథాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. దినకర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సభలో డా॥ వొలుకుల శివశంకరరావు, డా॥ అన్నదానం చిదంబరశాస్త్రి, ఎం.వి.ఎస్.ఎల్. ప్రసాద్, రచయిత నూనె అంకమ్మరావు, వడ్లమూడి వెంకట్రావు, కుర్రా ప్రసాద్‌బాబు, కప్పగంతుల మధుసూదన్ తదితరులు.

గుండెలను కుదిపేసిందో ? ఎంత ఆలోచనా మధనం జరిగి పోయిందో?

ఇప్పటిదాకా జరిగినవన్నీ విన్న నేను ఇంటికి పెద్ద కొడుకుగా ఇక నోరు విప్పాల్సిన సమయమొచ్చింది. ఇప్పుడు విప్పకుంటే, ఇక ఎప్పుడూ విప్పే అవసరమే లేకుండా పోతుంది అనుకున్న నేను" లేదు నాన్నా! నువ్వెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు. ఇప్పటికే అమ్మను పోగొట్టుకున్న మేము నిన్ను గూడా పోగొట్టు కోలేము. ఒక్క చేతిమీద ఇందరిని సాకిన నిన్ను ఒక్కణ్ణి సాకడానికి నువ్వన్నట్టు ఇంతరచ్చ అవసరంలేదు. నువ్వు నా దగ్గరే ఉందువు గాని మాతో వచ్చెయ్యి" అంటూ అభ్యర్థించాను.

నాన్న "నీకు తెలియదురా పెద్దోడా! ఈ విషయంలో నా మాటకు ఎదురు చెప్పకు" అంటూ తన నిర్ణయానికి తిరుగులేదన్నట్టు తెలియజేశాడు.

నాన్న నిర్ణయంతో మాచెల్లి, మేనత్తలిద్దరూ లేచి నాన్నను పట్టుకుని బావురుమన్నారు.

అక్కడున్న మా వాళ్ళంతా మౌన గంభీరంగా కూర్చుని జరుగుతున్నదాన్ని చూడసాగారు.

"ఒకపని చేయండినాన్నా! అమ్మ సంవత్సరీకం వెళ్లిందాకా నన్నా ఆఁ ఆశ్రమానికి వెళ్ళాలన్న మీ నిర్ణయాన్ని వాయిదా వేయండి, ఆ తరువాత వెళుదురుగాని" తాత్కాలికంగానైనా నాన్న ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్న ఆశతో అన్నాను.

నాన్న ఆలోచనలో పడిపోయాడు.

"అన్నా! పెద్దోడు చెప్పినట్టు వదిన సంవత్సరీకం వెళ్ళేదాకా ఆగుమరి. అప్పటిదాకా నీకు ఎవరిదగ్గర ఉండాలన్పిస్తే వాళ్ళ దగ్గరుండు. ఎక్కడికెళ్ళాలన్పిస్తే అక్కడికెళ్ళు" ఇనుము బాగా కాగినప్పుడే దెబ్బకొట్టాలన్న సూత్రాన్ని ఆచరణలో పెడుతూ మా పెద్దబాబాయి రంగంలోకి దిగాడు.

నాన్న అతికష్టం మీద 'సరే' అన్నాడు.

× × ×

నాన్న మా ఇంటికొచ్చి అప్పుడేఆరు నెలలవుతుంది. తినేదితింటూనే ఉన్నా తిండి మీదకాక అమ్మజ్ఞాపకాల్లో బతుకుతూ చిక్కి సగమయ్యాడు. భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మికపఠనంతో పొద్దుపుచ్చుతూ బ్రతుకుమీద ఆసక్తి లేకుండా రోజులు వెళ్ళదీయసాగాడు....

పొద్దున పదిగంటలకు ఆఫీస్‌కెళితే మళ్ళీ రాత్రి ఏ పదిగంటలకో ఇల్లు చేరేనాకు పగలంతా ఇంట్లో నాన్నకు సౌకర్యంగా జరుగుతుందో లేదో నాకు తెలిసేదికాదు.

ఓరోజు రాత్రి అన్నాలు తిని పడుకోబోయేముందు "పెద్దోడా! ఎల్లుండి నన్ను హైదరాబాద్ రైలెక్కించరా! చెల్లిని చూడాలన్పిస్తుంది" అంటూ చెప్పి నాకు మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకూడదన్నట్టు వెంటనే తన గదిలోకెళ్లి తలుపేసుకున్నాడు నాన్న.

"ఇంట్లో ఏదైనా జరిగిందా? ఇంత హఠాత్‌గా నాన్నెందుకెళ్ళి పోతానంటున్నాడు" అంటూ మా ఆవిడనడిగాను.

"నాకేంతెలియదు" ఆముక్తసరి సమాధానంలోనే ఖచ్చితంగా ఏదో జరిగిందన్న సమాచారం స్పష్టంగా కన్పించింది.

ఏంచేయాలో తోచని చిత్రమైన పరిస్థితిలో నాకు ఊపిరి సలపకుండా అయిపోయింది.

అయితే, ఆమరునాటి సాయంత్రానికి మా రెండో అమ్మాయిద్వారా నాన్న

## కోపూరి మాణిక్యమ్మ స్మారక
## "దీపావళి కథల పోటీ ఫలితాలు"

ప్రథమ బహుమతి

**అమ్మ పోయింతర్వాత**

శ్రీ శిరంశెట్టి కాంతారావు, పాతపాల్వంచ

ద్వితీయ బహుమతి

**వాన రావలె**

డా॥ కాలువ మల్లయ్య, హైదరాబాద్.

తృతీయ బహుమతి

**స్వీట్ హోమ్**

ఎం.ఆర్. అరుణకుమారి, అశోకపురం, చిత్తూరు.

**గోడ గడియారం**

ఎస్. విజయలక్ష్మి, హైదరాబాద్.

న్యాయనిర్ణేత
శ్రీ మధురాంతకం నరేంద్ర

పోటీల్లో పాల్గొన్న కథకులకు,
పోటీ న్యాయనిర్ణేతకు, ఈ పోటీకి ఆర్థిక సహకారాన్ని అందించిన శ్రీమతి & శ్రీ కోపూరి రామచంద్రరావు, పుష్పాదేవి దంపతులకు
కృతజ్ఞతలు...

నిర్వహణ : మిసుకు మాసపత్రిక

హైదరాబాద్ నిర్ణయం వెనుకగల అసలు కారణమేంటో నాకు తెలియరాలేదు.

నిన్న మధ్యాహ్నం నాన్న ఎందుకో బజారుకెళ్ళినప్పుడు మాచిన్న బావమరిది దగ్గర్నుండి ఫోనొచ్చినప్పుడు 'మామయ్యొచ్చి ఆరునెల్లవుతుందిరా! ఈ ఆరునెల్ల నుండి ఒక్కళ్ళన్నా ఇటువచ్చి తిరిగి చూడలేదు. ఏం నేనొక్కదాన్నే ఉన్నానా చెయ్యడానికి? రేప్పొద్దున ఆస్తులు పంచుకునేటప్పుడు అందరూ సమానంగా పంచుకోరా?" అంటూ ఫోన్లోనే పెద్దగా మాట్లాడుతుండగా బయటికెళ్లిన నాన్న గూడా అదే సమయానికి ఇంట్లోకొచ్చి కోడలంటున్న మాటలన్నీ విని మవునంగా పక్కకు తప్పుకున్నాడట.

చిన్న నాటినుండీ మా ఇంట్లో పెరిగి మాతో పాటు నాన్న ఆదరణను పొందిన మా ఆవిడ మనసులో అలాంటి భావాలు దాగి ఉన్నాయని ఊహించలేని నాన్నకు ఆమె మాటలు శరాఘాతమే అయ్యాయి.

నాన్న ముందు ఆవిడతో గొడవ పడడం నాన్నకు మరింత ఇష్టంలేని పని అవుతుంది కాబట్టి విషయం ఏదీ తెలియనట్టే మసులుకున్నాను.

ఆఁ తరువాత నేనూ, తనుకూడా ఎంత బ్రతిమాలినా నాన్న హైదరాబాద్ ప్రయాణాన్ని మాత్రం ఆపలేక పోయాము.

× × ×

పెద్దోడా! నేనిక్కడుండలేక పోతున్నాన్రా! వీళ్ళునన్ను బాగానే చూసుకుంటున్నారు. కానీ పల్లెటూరులో పుట్టి పెరిగిన నాకు ఈ హైదరాబాద్ వాతావరణమెందుకో సరిపడడంలేదురా! ఇబ్బందిగా ఉంటుంది. పైగా వీళ్లంతా ఉదయం ఎనిమిది గంటలకు ఇంట్లోనుంచి బయట పడితే మళ్ళీ రాత్రి ఆరుగంటల తరువాతగానీ ఒక్కొక్కళ్ళూ ఇల్లు చేరరు. ఈ మధ్యలో నేనొక్కణ్ణే ఇంట్లో ఉండాలి. ఒంటరితనంలో మీ అమ్మ పదే, పదే జ్ఞాపకానికొస్తుంది. దాంతోమనసంతా దిగులు అలుముకుంటూ నేనూ తొందరగా దాటిపోతే బాగుండునని పిస్తుంది. మా యాభైఏండ్ల కాపురంలో ఏ ఒక్కరోజూ వంటింట్లో కాలుపెట్టడం ఎరుగని నేను మధ్యాహ్నం అన్నంపెట్టుకుని తినాల్సొస్తుంది. తినకపోతే అమ్మాయి నొచ్చుకుంటుంది. తింటుంటే ముద్ద, ముద్దకూ మీ అమ్మ నా తలపుల్లో కొస్తుందిరా! నా ఇబ్బందిని గమనించిన బావా, చెల్లి వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు. నేను ఇబ్బంది పడుతూ, వాళ్ళను ఇబ్బందిపెట్టే బదులు ఇక్కణ్ణుండి వెళ్ళి పోవడవేఁ మంచిదనుకుంటున్నాను. హైదరాబాద్ వెళ్ళిన ఓ పదిహేను, ఇరవై రోజులతరువాత ఓ రోజు మధ్యాహ్నం నేను ఆఫీస్‌లో ఉండగా ఫోన్ చేసిన నాన్న గొంతుదుఃఖంతో జీరబోతుంటే చెప్పుకొచ్చాడు.

నాన్న అంత బేలగా మాట్లాడడం ఇంత వరకూ ఎరుగని నేను దిగ్భ్రమకులోనౌతూ" అసలిదంతా ఎందుకునాన్నా! జరిగిందేదో జరిగింది ఇక ముందు ఏదీ జరుగదుగానీ మాదగ్గరకొచ్చెయ్" అన్నాను.

"లేదురా! ఈ ఐదారు నెల్లూ అందరి దగ్గరకీ వెళ్లాలనుకుంటున్నాను. సూర్యాపేటలో ఉన్న నాలుగో వాడి భార్యా పిల్లలు కళ్ళల్లో మెదులుతున్నారు. కొద్దిరోజులు వాళ్ళతో ఉండాలను కుంటున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాడు.

× × ×

మీ కొడుకు చేసేదంతా చేసి, చక్కా తనదారిన తానెళ్లిపోయాడు. పోయినోడు పోతూ.. పోతూ ఈ ఇద్దరు పిల్లల్నీ నామెడకు తగిలించిపోయాడు. ఇప్పటి దాకా మీరు పంచిచ్చిన ఆస్తులేంలేవుగాని, మీ పిల్లల్ని మాత్రం సాకాల్సి వస్తుంది. ఈ రోజుల్లో ఆడమనిషి ఒక్కతి ఇద్దరు పిల్లల్ని సాకాలంటే మాటలా? ఇన్నాళ్ళూ ఎలాగో సాకానుగానీ, ఇక నావల్లగాదు. మీ పిల్లల్ని మీరు తీసుకెళ్ళండి, నా చావేదో నేను ఛస్తాను" ఇదిరా పెద్దోడా నేనే పది, పదిహేను రోజులుండే సరికి నాలుగో వాడి భార్య నాకు చేసిన మర్యాద.




తాదూర కంతలేదు మెడకో డోలన్నట్టు నాకే దిక్కులేక అక్కడికి, ఇక్కడికీ తిరుగుతుంటే నన్నీ చిన్న పిల్లల్ని తీసుకెళ్ళమని ఎంత నిర్దయగా మాట్లాడుతుంది! రెండురోజులు ఇంట్లో పొయ్యికూడా అంటించలేదు. పిల్లలు ఆకలితో నకనకలాడిపోతుంటే చూడలేక హోటల్‌కి తీసుకెళ్ళి తినిపిం చాను. ఆఁ అమ్మాయి తల్లిదండ్రులుగూడా ముఖం చూడకుండా మాట్లాడారు. మగవాడికి చివరిదశలో భార్యఅవసరం ఎంతుంటుందో అనుభవించేవాడికి తప్ప, వాడిని పుట్టించిన ఆఁ బ్రహ్మకు కూడా తెలియదురా! ఆమెకోపం చల్లారిందాకా ఎలాగోలా నాలుగు రోజులు ఓపిక పట్టి, ఆమె పిల్లలను ఆమెకు అప్పగించి మెల్లగా ఇక్కణ్ణుంచి మనూరు వెళ్ళిపోతాను. అక్కడి వాళ్ళతోనూ ఏ ఏ అనుభవాలు రాసిపెట్టి ఉన్నాయోఅవికూడా అనుభవించాలికదా?" ఓ రోజు పొద్దున్నే ఫోన్ చేసిననాన్న ఆఁ కోడలు తనమీద ఎందుకంత కోపం తెచ్చుకుందో అర్థంకాక చిన్న పిల్లాడిలా వెక్కుతూ చెప్పుకొచ్చాడు.

చిన్ననాటినుండీ నేనెరిగిన నాన్నకు, ఈ నాన్నకు ఎక్కడా పోలికేలేదు. అప్పటినాన్న ఎన్ని ఒడిదుడుకుల తుఫాన్‌లనైనా ధైర్యంగా ఎదుర్కొన్న మేరుపర్వతం. ఇప్పటినాన్న దుర్బలుడు. ఏమిటీ తేడా?! నాకు తెలిసిన తేడా ఒక్కటే. అప్పటి నాన్నకు మా అమ్ముంది. ఇప్పటి నాన్నకు లేదు. అదేతేడా. ఆయన దుఃఖం వింటున్న నాకూఏడుపొస్తుంటే "ఇప్పుడు నేను ఏం చేయాలో చెప్పునాన్నా" అన్నాను దీనంగా.

"చేసేదేముందిరా! మీ అమ్మ సంవత్సరీకం వెళ్ళే వరకు నాకీ అనుభవాల గాయాలు అవుతూనే ఉంటాయే. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ అన్నారు కదా! నేను ఇదే చేసుకున్నానేమో? ఆఁ పైన దుఃఖంతో గొంతే పూడుకుపోయిందో? సిగ్నల్ అందలేదో? కాని, నాన్న ఫోన్ మాత్రం కట్టయ్యింది. ఆఁ తర్వాత నేను ప్రయత్నించినా నాన్న ఫోన్ కలువలేదు.

× × ×

నాన్నెందుకో గాని ఈ మధ్య ఇరవై రోజులుగా ఫోన్ చేయడం లేదు. నేను చేసినా లేపడం లేదు. ఒక వేళ పొరపాటున లేపినా ఇంతకు ముందులా కాకుండా అడిగిందానికి మాత్రమే "ఔను, కాదు" అంటూ ముక్తసరిగా

సమాధానాలు ఇస్తున్నాడు.

సరే విషయమేంటో కనుక్కుందామని నేనే ఓ రోజు బయలుదేరి మా ఊరెళ్ళాను. అమ్మ ఉన్నప్పుడు కళకళ్ళాడుతూ కన్నుల నిండుగా అంత దూరానికి కనిపించే ఇల్లు, దేవుడు లేని ఆలయంలా కళా విహీనంగా ఉంది. ఇంటిని చూస్తూనే బాధ పడుతూ ఇంట్లోకెళ్ళిన నాకు అంతకంటే గొప్ప దృశ్యం కళ్ళబడి కొయ్యబారిపోయాను.

"ఇదేంటి నాన్నా! నువ్వు బట్టలుతుక్కుంటున్నావేంటి? ఇంట్లో వాళ్ళంతా ఎటు వెళ్ళారు?" అంటూ ఆయన చేతిలోని పంచెను అందుకుని పిండి ఆరేస్తూ అన్నాను.

"ఏముందిరా! ఈ నెలరోజుల్నుండి మూడోవాడింట్లో తింటున్నాను. ఇక్కడికొచ్చి పడుకుంటున్నాను. వాళ్ళింటి దగ్గర నీళ్ళకు ఇబ్బందిగా ఉంది గదాని ఇక్కడే పిండుకుంటున్నాను. ఆ చాకలమ్మ మగడితో తగాదా పెట్టుకొని అమ్మ వారింటికెళ్ళి పోయింది". విషయాన్ని తేలిక చేయడం కోసం ప్రయత్నిస్తూ మెల్లగా చెప్పుకొచ్చాడు నాన్న.

"మరటువంటప్పుడు వాడి భార్య ఇక్కడికొచ్చి ఉండిపోవచ్చు గదా? ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు?" కాళ్ళూ, చేతులూ కడుక్కుంటూ అన్నాను.

"అసలు విషయమేంటంటే ఈ మధ్య వాళ్ళమ్మకు జబ్బుచేసి మంచాన పడింది. దాంతో వాళ్ళ నాన్న, తమ్ముడు వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు. వాళ్ళింటికెళ్దామంటే ఇక్కడనేనుండిపోయాను. నన్నువదిలేసి వెళితే నలుగురూ ఏమనుకుంటారోనన్న భయం, దాంతో పొమ్మనలేక పొగబెట్టినట్టు చేస్తుంది. వాడేమో మొదటినుండి ఆమె తానా అంటే వీడేమో తందానా అంటాడయ్యె. అందుకే నా పని నేను చేసుకోవాలని నిర్ణయించుకున్నా. ఇందులో నువ్వు ఆవేశపడాల్సిందేమీ లేదు" స్నానం చేయడానికి తయారవుతూ నన్ను చల్లబరచాలని చూడసాగాడు నాన్న.

"మరి ఇంట్లోనే ఉంటున్న రెండో వాడు వాళ్ళేమయ్యారు?" వాసాలకు పట్టిన సాలీళ్ళను చూస్తూ ప్రశ్నించాను.

"కడుపు చించుకుంటే కాళ్ళమీదే పడుతుందన్నట్టు ఏంజెప్పాల్రా! ఈ ఇల్లు వాళ్ళకు రాసిస్తే నన్ను చూసుకుంటారట. లేకుంటే ఇంట్లో నుండి వెళ్ళిపోతారట. అదెట్లా కుదురుతుందన్నాను. అంతే 'మిగతావాళ్లొప్పుకోరా? మీకే ఇష్టం లేదా' అంటూ నానా రాద్ధాంతం చేసిన మొగుడూ, పెళ్ళాలు ఆ రోజు మొదలు గొంతెండిపోతుందన్నా గ్లాసుడు నీళ్ళివ్వలేదు. వారం రోజుల క్రిందట వాళ్ళ అత్తగారి ఊర్లో "బొడ్రాయి" వేస్తున్నారని వెళ్లారుగానీ, ఇంతవరకూ రాలేదు. చెప్పాలా వద్దా అన్నట్టు సంశయిస్తూనే కొన్ని చెప్పి, కొన్ని చెప్పకుండా చెప్పుకొచ్చాడు నాన్న.

ఇంత ఇంట్లో ఒక్కడివే ఉంటున్నావన్నమాట. ఏ అర్ధరాత్రో కాలునొచ్చినా, కన్ను నొచ్చినా పలకరించే మనిషే లేకుండా ఏంటి నాన్నా ఇదంతా? ఎక్కడికీ వెళ్లొద్దూ అంటే వినవే. ఉండమన్నచోట ఉండవే", అంటూ కొంచెం విసుక్కుంటూ మాట్లాడాను.

"ఎందుకురా! నామీద విసుక్కుంటావు? అయినా ఇంకెన్నిరోజుల్లే మహా అయితే ఇంకో నెల. మీ అమ్మ సంవత్సరీకం అయిపోయిందనుకో నా దారి నేచూసుకుంటాగాని, నువ్వేం హైరానాపడకు. స్నానం చేసివచ్చి తెల్లపంచె కట్టుకుంటూ అన్నాడు నాన్న.

"వీళ్ళిద్దరూ ఇట్లా చేశారు సరే. మరా చిన్నవాడికేమైంది? వాళ్ళింటికి రమ్మనలేదా?" మంచం వాల్చుకుని కూర్చుంటూ అన్నాను.

"ఎందుకు రమ్మన్లేదు. రమ్మన్నాడు.

"మర్నువ్వెందుకెళ్లలేదు?"

"వెళ్ళలేదని ఎవరన్నారు?"

"అక్కడేమైంది మరి?"

"ఏముంది. వాళ్ళకున్న ముగ్గురు చిన్న పిల్లలతోనే వాడి భార్య చేసుకోలేక చస్తుంటే, మధ్యలో ఈ ముసలాయన గోలేంటని ఎవరైనా అనుకోరా? అట్లా అనుకుని బయటకు గెంటేదాకా ఉండేదాని కన్నా ముందే జాగ్రత్తపడితే గౌరవం దక్కుతుందనుకున్నాను. నా యింటికి నేనొచ్చాను. అంతే" తనూ వచ్చి నాపక్కనే మంచంమీద కూర్చుంటూ అన్నాడు నాన్న.

చెప్పడం లేదుగాని ఖచ్చితంగా నాన్న మనసు నొచ్చుకునే సంఘటన ఏదో చిన్నవాడి ఇంట్లో జరిగే ఉంటుంది. అది కడుపులో దాచుకుంటూ బయటకు చెప్పడం లేదు.

నాన్నకు ఆస్తిపాస్తులు పెద్దగా లేకపోయినా కడుపున పుట్టిన మమ్ములనే ఆస్తులుగా భావించి పెంచి పెద్దచేసిన నాన్న, తను కూలీ, నాలీ చేసైనా మమ్ముల్ని జీతాలకు, వాతాలకు ఉంచకుండా అంతో, ఇంతో చదివించిన నాన్న, మా బాగుకోసం తన జీవితమంతా శ్రమించిన నాన్న అమ్మను కోల్పోయి రెక్కలు విరిగిన జటాయువులా కుప్పగూలిన నాన్న చివరికి ఆ కన్నవాళ్ళ చర్యలతో ఆత్మాభిమానం దెబ్బతిన్న నాన్న ఆ క్షణంలో నా కంటికి, కాలమనే బోయవానిచేతిలో మా అమ్మను కోల్పోయి రోధిస్తున్న క్రౌంచ పక్షిలా నా కళ్లకు కన్పించడంతో ఒక్కసారిగా నాలో పొంగుకొస్తున్న ఉద్విగ్నతను అణచుకోలేక నాన్నను పట్టుకుని బావురుమన్నాను.

మెల్లగా నా వీపు నిమురుతూ మనిషికి ఇంత సున్నితమైన మనస్సు పనికిరాదురా పెద్దోడా! ఏ మనిషైనా నరే అనుకోని ఎదురుదెబ్బలు తగిలినప్పుడు తట్టుకుని నిలబడే గుండె నిబ్బరం అలవర్చుకోవాలి. అయినా నాకిప్పుడేమైందని బాధపడుతున్నావ్? తన కన్నుల్లో కమ్ముతున్న నీళ్ళను రెప్పలతో అదిమిపడుతూ నన్ను సముదాయించాడు నాన్న.

"కొంతసేపటికి తేరుకున్న నేను ఇవ్వన్నీ వద్దులేగాని మా ఇంటికి వెళ్దాం పద నాన్నా" నాన్న చేతులు పట్టుకుంటూ బ్రతిమాలాను.

"లేదురా పెద్దోడా! మీ అమ్మ సంవత్సరీకం నిండా నెలరోజులు కూడా లేదు. చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి. అవన్నీ స్వయంగా నేను చూసుకుంటే తప్ప పూర్తికావు. అయితే నువ్వు మాత్రం ఓ వారం పదిరోజులు సెలవుపెట్టి ఉండాల్సొస్తుంది. ఎందుకంటే పన్లన్నీ నీమీదే ఆధారపడి ఉంటాయి". గూట్లో ఉన్న భగవద్గీతను చేతిలోకి తీసుకుంటూ అన్నాడు నాన్న.

"అదేంటి నాన్నా! ఒక్కరోజు కార్యక్రమానికి అన్నిరోజుల సెలవెందుకు?" ఆశ్చర్యంతో అడిగాను.

"ఎందుకో నీకే తెలుస్తుందిలేరా!" అంటూ గీతాపారాయణంలోకి వెళ్లిపోయాడు.

× × ×

ఆరోజు అమ్మ సంవత్సరీకం.

చుట్టాలుమొత్తం బీరుపోకుండా వచ్చారు.

అమ్మపోయిన తర్వాత ఈ ఏడాదిగా మళ్ళీ ఈరోజే నాన్న మొఖంలో పూర్వపు కళ నిండుగా కన్పించింది. వచ్చిన బంధువులందరినీ పేరు, పేరునా ఆప్యాయంగా పలుకరిస్తూ ఆనందించాడు.

ఆ రాత్రి భోజనాలైన తరువాత అందరం తీరుబడిగా కూర్చున్నప్పుడు" అన్నా! మరి నీ సంగతేంటి?" అంటూ నాన్న విషయాన్ని మెల్లగా కదిపాడు చిన్న బాబాయి వక్కపొడి నములుతూ...

"ఆ విషయం ఇప్పుడెందుకులేరా! రేపొద్దున మాట్లాడుకుందాంలే" అంటూ కావాలనే

దాటవేశాడు నాన్న.

సరేనంటూ అందరం కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడుకొని, ఆ తరువాత ఎక్కడివాళ్ళం అక్కడ పడుకుండిపోయాము.

× × ×

పిల్లలకేవో పరీక్షలున్నాయని చెప్పి చీకటితోనే హైదరాబాద్ వెళ్లిపోదామని తయారయిన మా చెల్లి, బావా వాళ్లు వెళుతున్నామని చెప్పడానికి నాన్న మంచం దగ్గరికెళ్లారు.

చిత్రంగా! నాన్న రాత్రి పడుకున్నప్పుడెలా ఉన్నాడో అలాగే ఉండడంతో ఏదో సందేహిస్తూనే "నాన్నా! నాన్నా!" అంటూ నాన్నను కదిపిన చెల్లి ఒక్కసారిగా "నాన్నా!" అంటూ మీదపడి ఘొల్లుమంది.

పడుకున్న వాళ్ళంతా ఉలిక్కిపడి లేచారు.

అందరికీ అర్థమైంది, నాన్న, అమ్మను చేరుకోడానికి నిద్రలోనే తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడని.

గత నెలరోజులుగా నాన్న మాటల్లోని ఆంతర్యమేమిటో అర్థమవుతున్నకొద్దీ నేను ఆశ్చర్యంలోకి కూరుకుపోసాగాను.

అమ్మ సంవత్సరీకం రోజున్నే, చుట్టాలందరూ ఉండగానే నాన్న అకస్మాత్తుగా పోయాడనే వార్త ఒక్కసారిగా ఊరంతా గుప్పుమనడంతో వీధిపట్టని జనం వచ్చేశారు.

వరిగడ్డి పక్కమీద పడుకోబెట్టిన నాన్న తలాపున వెలుగుతున్న దివ్వెను చూస్తుంటే తన చావును తానే నిర్దేశించుకున్న భీష్ముడులా కన్పించసాగాడు. తదుపరి జరగవలసిన కార్యక్రమాలకు ఏర్పాట్లు చక చకా జరుగుతున్నాయి.

ఇంతలో...

సైరన్ మోగించుకుంటూ వచ్చిన అంబులెన్స్ ఒకటి ఇంటిముందు ఆగింది.

"ఈ సమయంలో అంబులెన్స్ ఏమిటి?" అన్న ఆశ్చర్యంలో మునిగిపోయిన మేము చూస్తుండగానే అందులోనుండి ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులతోపాటు మరో ఇద్దరు మనుషులు స్ట్రెచర్ పట్టుకుని దిగి చక, చకా షామియానా కిందికి వచ్చారు.

"అనంతయ్యగారిల్లిదేనా?" వచ్చినవాళ్లల్లో ఓ డాక్టర్ మెడలో స్టెతస్కోప్ వేసుకుంటూ అడిగాడు.

"ఔను" చెప్పారెవరో

"వాళ్ళ పెద్దబ్బాయినోసారిటు పిలుస్తారా?" డాక్టర్

"ఇంతకూ మీరెవరు సార్! వాడెందుకు?" ముందుకొస్తూ అడిగాడు మా చిన్నాన్న.

"మేము విజయవాడ ఎన్టీయార్ హెల్త్ యూనివర్శిటీ నుండి వస్తున్నాం". డాక్టర్ చెప్పాడు.

"విషయమేమిటో చెప్పండి, నేనే వాళ్ళ పెద్దబ్బాయిని" అప్పటిదాకా పక్కన నిలబడి చూస్తున్న నేను వాళ్ల ముందుకొస్తూ అన్నాను.

"మీ నాన్నగారు తన శరీరాన్ని మొత్తం యూనివర్శిటీకి దానంచేశారు. ఏరోజు ఆయన పోతే ఆరోజు వెంటనే మాకు సమాచారం అందించే ఏర్పాటు కూడా ముందే చేయించాడు. వెంటనే మాకు సమాచారం అందింది కాబట్టి బయలుదేరి వచ్చేశాం" తామెందుకొచ్చారో ఆ వివరాలను ఒక్కొక్కటీ వివరించాడు మరో డాక్టర్.

ఒక్కసారిగా షామియానాలకింద నిశ్శబ్దం అలుముకుంది.

నా కళ్ళల్లోనుండి రెండు కన్నీటిబొట్లు రాలిపడ్డాయి.

కవిత

# చెలరేగిపో

**డా.సి. నారాయణరెడ్డి**

సుదీర్ఘంగా సాగిపోతున్న నా జీవితాన్ని
ప్రశ్నించాను–
"శ్వాసలను అతలాకుతలం చేస్తున్న
జటిల సమస్యల మధ్య
నీకు విసుగు రావడం లేదా అని".
అది ఇలా బదులు పలికింది
"విసుగు రావడమంటే ఓటమిని ఒప్పుకోవడమే
ఓడిపోయి జీవించడమంటే
బతికున్న నీ శవాన్ని మోసుకు పోవడమే".
జీవితమిచ్చిన సమాధానం నన్ను కుదిపేసింది
అనుకున్నది కానప్పుడు నిట్టూర్చే గుణం
అసమర్థతకు మరో రూపమని
తెలిసిపోయింది.
అస్తమిస్తున్న సూర్యుడు
శాశ్వతంగా చీకట్లోనే ఉండిపోడు.
తనకు కలిగిన ఆ స్థితి తాత్కాలికమే అని
అరుణోదయంతో నిరూపించుకుంటాడు.
ఎవరైనా అప్పుడప్పుడు
ముఖం కాస్త వెలవెలబోతే
రక్తం ఇంకిపోయినట్టు కాదు.
నైరాశ్యంతో కుంగిపోవడమంటే
తనను తాను నిలువునా పాతేసుకున్నట్టే.
ఎదురు తిరిగిన పరిస్థితులను ఎదుర్కోవడానికి
ఆశను మించిన ఆయుధం లేదు.
ఈ కృతనిశ్చయంతో వున్న నా వెన్ను తట్టిన
జీవితం
నాపై ఇలా ఆశీరభినందనలను వర్షించింది.
"ఆగిపోయినట్టున్నా సాగిపో
మూగవోయినట్టున్నా మోగిపో
ఒక్క క్షణమైనా ముడుచుకుపోకుండా
ఉప్పెనలా చెలరేగిపో".